క్లుప్తంగా

విస్తృత తనిఖీలు

తాళ్లరేవు: కాకినాడ జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిషనర్ రేణుక ఆధ్వర్యంలో మండల పరిధిలోని పలు ఎక్సైజ్ చెక్‌పోస్టుల్లో ఆదివారం పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. పోలేకుర్రు వై.జంక్షన్, సుంకరపాలెం చెక్‌పోస్టుల్లో కార్లు, ద్విచక్ర వాహనాలను తనిఖీ చేస్తున్నారు. యానాం నుంచి వచ్చే వాహనాలన్నింటినీ తనిఖీలు చేసి అక్రమ మద్యం తరలిపోకుండా చర్యలు చేపడుతున్నట్లు రేణుక తెలిపారు. ఈ కార్యక్రమంలో సుంకరపాలెం ఎక్సైజ్ చెక్‌పోస్టు సీఐ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టుల భర్తీకి చర్యలు

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తున్నట్లు వచ్చే ఆరు నెలల్లో సుమారు వెయ్యి పోస్టులను భర్తీ చేస్తామని సీఎం రంగసామి ప్రకటించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ 2021లో ఎన్ఆర్ కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి సుమారు 4వేల ప్రభుత్వ ఉద్యోగాలను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేశామన్నారు. వచ్చే ఆరు నెలల్లో వెయ్యి పోస్టులను భర్తీ చేస్తామని అందులో 300 ఎల్‌డీసీలు ఉన్నాయన్నారు.

మున్సిపల్ చైర్‌పర్సన్‌కు పరామర్శ

అమలాపురం టౌన్: మాతృ వియోగంతో బాధపడుతున్న అమలాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణిని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు వంగా గిరిజాకుమారి ఆదివారం పరామర్శించారు. చైర్‌పర్సన్ తల్లి శిరగం శ్రీరామ రాఘవమ్మ ఈనెల 17న వృద్ధాప్యంతో మృతి చెందారు. అమలాపురం పట్టణం నారాయణపేటలోని దివంగత శ్రీరామ రాఘవమ్మ స్వగృహానికి గిరిజాకుమారి వచ్చి ఆ కుటుంబాన్ని పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

దివ్యాంగులకు సివిల్స్ పరీక్షకు ఉచిత శిక్షణ

యానాం: ఉన్నత విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలుగల విద్యార్థులైన దివ్యాంగులకు సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సోషల్ ఇంక్లూజన్ (హెచ్‌ఈపీఎస్ఎన్) ద్వారా పుదుచ్చేరి యూనివర్సిటీలో సివిల్ సర్వీసెస్‌కు ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆదివారం యూనివర్సిటీ అధికారులు మాట్లాడుతూ 12 నెలల పాటు కొనసాగే ఉచిత కోచింగ్ కేవలం దివ్యాంగ విద్యార్థులకు మాత్రమే ఉంటుందన్నారు. సామాజిక న్యాయ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ డిజేబిలిటీస్ (డీఈపీడబ్ల్యూడీ) శాఖ ఈ కార్యక్రమానికి ఆర్థిక సహాయం అందజేస్తుందని తెలిపారు. సంవత్సర ఆదాయం రూ.8లక్షలు కంటే తక్కువ ఉన్న 20 నుంచి 41 ఏళ్ల వయస్సు కలిగిన డిగ్రీ పూర్తిచేసిన, ఆఖరి సంవత్సర పరీక్షలు రాసిన దివ్యాంగులు అర్హులని తెలిపారు. అనుభవజ్ఞులతో శిక్షణతో పాటు ఎంపికైనవారికి నెలకు రూ.6వేలు స్టైఫండ్, 24 గంటలూ ఉచిత లైబ్రరీ తదితర సౌకర్యాలుంటాయన్నారు.

వీరేశ్వరుని ఆలయంలో ఘనంగా బిల్వార్చన

ఐ.పోలవరం: మురమళ్ల వీరేశ్వర స్వామి ఆలయంలో వైశాఖ మాసం మాస శివరాత్రి మహాపర్వదినం పురస్కరించుకుని ఆదివారం లక్ష పత్రి పూజ ఘనంగా నిర్వహించారు. పురోహితులు బ్రహ్మశ్రీ నాగాభట్ల రామకృష్ణమూర్తి, ఆలయ అర్చకులు బ్రహ్మశ్రీ యనమండ్ర సుబ్బారావు ఆధ్వర్యంలో లక్ష పత్రి పూజ చేశారు. లక్ష పత్రి పూజలో 11 మంది భక్తులు పాల్గొన్నారు. ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వాహణాధికారి మాచిరాజు లక్ష్మీ నారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. నాగాభట్ల శ్రీరామ్ శర్మ, కిషోర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

కోన శ్రీనివాసరావుకు సత్కారం



శ్రీనివాసరావును సత్కరిస్తున్న నాయకులు

ముమ్మిడివరం: స్థానిక నగర పంచాయతీ స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమితులైన ప్రముఖ న్యాయవాది కోన వెంకటశ్రీనివాసరావును ఆదివారం పలువురు నాయకులు అభినందించి సత్కరించారు. నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు పెన్మత్స చిట్టిరాజు, కౌన్సిలర్ బొంతు సత్యశ్రీనివాస్, మట్టా సత్తిబాబు, పళ్ల వీరబాబు పాల్గొన్నారు

సంక్షేమ పథకాలపై చర్చించేందుకు సిద్ధం

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా ఉన్న సంక్షేమ పథకాలపై సీఎం రంగసామితో ప్రజావేదికపై బహిరంగ చర్చకు కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందని పుదుచ్చేరి ఎంపీ వి.వైతిలింగం ప్రకటించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చాలా చోట్ల సరైన రహదారులు లేవన్నారు. ముందుగా నాణ్యత కలిగిన రక్షిత మంచినీటిని ప్రజలకు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలకు అమలు చేస్తామంటున్న సంక్షేమ పథకాల అమలు తీరుపై బహిరంగంగా చర్చించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సీఎం నారాయణసామి, మాజీ మంత్రి కందసామి, మాజీ ఎమ్మెల్యే అనంతరామన్ పాల్గొన్నారు.

సిబ్బందికి జీతాల్లేవు... రైతులకు చెల్లింపుల్లేవు!

- జీతాలు మంజూరు చేయాలని కోరుతున్న పీపీసీ సిబ్బంది
- ధాన్యం సొమ్ము కోసం రైతుల ఎదురుచూపులు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం



ఉప్పలగుప్తంలో వేతనాలు అందించాలని ఏవో కుమార్‌బాబుకు వినతిపత్రం అందిస్తున్న పీపీసీ సిబ్బంది (ఫైల్)



కామనగరువులో ధాన్యాన్ని మిల్లుకు తరలిస్తున్న రైతులు

ఉప్పలగుప్తం: రైతులకు మేలు చేస్తాం, రైతన్నను అందలమెక్కిస్తామని గొప్పలు చెప్పకుంటున్న కూటమి ప్రభుత్వంలో సాగుదారులు ధాన్యాన్ని విక్రయించడానికి నానా అవస్థలు పడాల్సి వస్తోంది. ధాన్యం కొనుగోలు చేసి 24 గంటల్లో ధాన్యం సొమ్మును రైతులకు చెల్లుబాటు చేస్తామని ప్రభుత్వం చేసిన వాగ్దానాలు కొన్ని రోజులకే అటకెక్కాయి. ప్రభుత్వ రంగంలో పనిచేసే ఔట్‌సోర్సింగ్ విధానంలో ప్యాడీ ప్రొక్యూర్‌మెంట్ సెంటర్ (పీపీసీ) సిబ్బందికి సకాలంలో జీతాలు అందించి ఆదుకుంటామన్న మాటలు ఒట్టి నీటి మీద రాతలుగా కనిపిస్తున్నాయి. ఒక పక్క ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పనిచేస్తున్న సిబ్బందికి (ఖరీఫ్, రబీ) రెండు సీజన్‌ల నుంచి జీతం అందక లబోదిబోమంటున్నారు. ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా ఎటువంటి స్పందన ఉండటం లేదని తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అవసరానికి సేవ చేయించుకుని జీతాలు అందించకపోవడంతో కుటుంబ పోషణ సాగేదెలా అని గగ్గోలు పెడుతున్నారు. మరో పక్క టార్గెట్ల పేరుతో ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి అధికారులు అలసత్వం వహిస్తూ దళారీ వ్యవస్థను ప్రోత్సహించడంతో పండించుకున్న ధాన్యాన్ని గిట్టుబాటు ధరకు విక్రయించడానికి లేకుండా రైతు స్వేచ్ఛకు భంగం కలుగుతోందని అన్నదాతలు కన్నీరుమున్నీరవుతున్నారు. .

గతంలో ధాన్యం విక్రయం సులభతరం

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ప్రభుత్వ పరిపాలనలో ప్రతి గ్రామంలో రైతులు ధాన్యాన్ని విక్రయించుకోవడానికి సులువుగా ఉండే విధంగా అందుబాటులోకి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కొనుగోలు కేంద్రంలో ఒక టెక్నికల్ అసిస్టెంటు (టీఏ), డేటా ఎంట్రీ ఆపరేటర్ (డీఈవో), ఒక సహాయకులను నియమించారు. రైతులకు అందుబాటులో సిబ్బంది ఉండి, ధాన్యం విక్రయించుకునే ప్రక్రియ రైతుకు సులువుగా ఉండటంతో కూటమి ప్రభుత్వం ఆ వ్యవస్థను కొనసాగిస్తూ కార్యాచరణ నడిపిస్తోంది. ఈ సిబ్బంది ప్రతి సీజన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులకు అందుబాటులో ఉంటూ గ్రామంలో సేవలందించాల్సి ఉంది. ఈ సిబ్బంది ముగ్గురూ సమన్వయంతో రైతు వరి క్షేత్రాల్లో నమూనాలను తీసుకుని, ఆన్‌లైన్ చేసి మిల్లుకు పంపించాల్సి ఉంది. ఈ సిబ్బంది కేవలం ఖరీఫ్ సీజన్‌లో మూడు నెలలు, రబీ సీజన్‌లో మూడు నెలలు మాత్రమే పనిచేస్తారు. ఈ పనిచేసిన కాలానికి మాత్రమే ప్రభుత్వం సిబ్బందికి వేతనం చెల్లిస్తుంది. మిగతా కాలం అంతా వేరే వృత్తి వైపునకు వెళతారు.

వేతనాలు అందించడంలో ప్రభుత్వం అలసత్వం

అమలాపురం నియోజకవర్గంలో ప్రస్తుతం 54 ధాన్యం కొనుగోలు కేంద్రాలున్నాయి. వీటిలో 162 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. ఈ సిబ్బంది ధాన్యం కొనుగోలు సమయంలో పని చేసినంత కాలం నెలకు టెక్నికల్ అసిస్టెంట్‌కు రూ.15,000, డీఈవోకు రూ.12,000, సహాయకులకు రూ.9,000 చొప్పున ప్రభుత్వం సొసైటీల సహకారంతో వేతనాలు అందిస్తుంది. ధాన్యం కొనుగోలు సమయంలో అరుగాలం శ్రమించి ప్రభుత్వ ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తూ రైతులకు సేవ చేస్తున్నా ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్‌లో, ప్రస్తుతం కొనసాగుతున్న రబీ సీజన్‌లో సైతం ప్రభుత్వం వేతనాలు అందించడంలో ప్రభుత్వం అలసత్వం వహించడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని సిబ్బంది ఆవేదన చెందుతున్నారు. జీతాలు లేకపోతే జీవనం సాగేదెలా అని వారు ఆందోళన చెందుతున్నారు.

ఈ తొలకరి సాగేదెలా?

తొలకరి వరి సాగు చేసి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు రబీపై ఆశలు పెంచుకోవడంతో ప్రభుత్వ అధికారుల అలసత్వంతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటూనే వచ్చారు. రబీ పంట చేతికొచ్చినా అమ్ముకునే సులువైన మార్గం లేకపోవడంతో నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు. తీరా ఏదో విధంగా పంటను విక్రయించినా ధాన్యం సొమ్ము చెల్లింపు కావడంలేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం 24 గంటల్లో నగదు చెల్లిస్తామని చెప్పినా, క్షేత్ర స్థాయిలో అవేమీ ఆచరణలో ఉండటం లేదని వారు వాపోతున్నారు. ఆన్‌లైన్ అయినట్టు ఫోన్‌లో కాల్ సెంటర్ల నుంచి పదే పదే ఫోన్లు వస్తున్నా తీరా బ్యాంకులకు వెళ్లి చూసుకుంటే నగదు జమ కాకపోవడంతో రైతులు తీవ్ర అసహనానికి గురవుతున్నారు. ఇప్పటికే రూ.1,720 ప్రభుత్వం ప్రకటించినా బయటి మార్కెట్లో రూ.1,000 నుండి రూ.1,500 వరకు కొనడంతో రైతు తీవ్రంగా నష్టపోయాడు. మరో పది రోజుల్లో తొలకరి (ఖరీఫ్) సీజన్ ప్రారంభమవుతుందని, రబీ ధాన్యం సొమ్ములు రోజులు గడుస్తున్నా జమ కాకపోతే తొలకరి నాట్లు ఏ విధంగా సిద్ధం చేసుకోవాలనే తీవ్ర అయోమయ పరిస్థితుల్లో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు.

జీతాల్లేక ఇబ్బందులు



ఈ వృత్తినే నమ్ముకుని ఉన్న మాకు ప్రభుత్వం ప్రతి సీజన్‌లో మూడు నెలలు చొప్పున 6 నెలలు మాత్రమే జీతం అందిస్తుంది. మిగతా రోజులంతా ఆ జీతంతోనే కుటుంబ పోషణ చేసుకోవాలి. ఈ ప్రభుత్వం రెండు సీజన్‌లలో విధులు నిర్వర్తించాం. ఏ సీజన్‌కు మాకు వేతనం అందించలేదు. జీతాలు లేక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నాం. ప్రభుత్వం స్పందించి వెంటనే జీతాలు అమలు చేయాలి.

–ఎమ్.వెంకటేష్, టెక్నికల్ అసిస్టెంట్, ఉప్పలగుప్తం మండలం

సకాలంలో సొమ్ము అందడం లేదు



నేను 10 ఎకరాల కౌలు రైతుని ధాన్యం విక్రయించుకుని 15 రోజులు గడుస్తుంది. నేటి వరకూ నా ఖాతాలో నగదు జమ కాలేదు. అప్పు చేసి వ్యవసాయం చేస్తున్నాం. ప్రభుత్వం 24 గంటల్లో నగదు జమ చేస్తామని చెప్పినా అమలు కాలేదు. ధాన్యం విక్రయించడంతో ఎరువుల దుకాణం యజమానులు తీవ్ర ఒత్తిడిని తీసుకొస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతు వ్యవసాయం చేయడం సాహసంగా ఉంటోంది.

–కె.రాజు, కౌలు రైతు, పెదగాడవిల్లి, ఉప్పలగుప్తం మండలం

కాలువను తలపిస్తున్న రహదారి



విలసవిల్లిలో కాలువను తలపిస్తున్న రహదారి

ఉప్పలగుప్తం: విలసవిల్లిలో సాయిబాబా గుడి ఆవరణలో రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు కాలువను తలపిస్తోంది. మూడు రోజుల క్రితం కురిసిన ఓ మోస్తరు వర్షానికి రోడ్డు జలమయమైందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. గతంలో వర్షం నీరు దిగేందుకు డ్రెయిన్ వ్యవస్థ ఉండేదని, ఇటీవల నూతనంగా సీసీ రోడ్డును నిర్మాణంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో డ్రెయిన్‌ను పూర్తిగా మూసివేశారన్నారు. దీనితో రోడ్డుపై మోకాళ్ల లోతులో నీరు చేరి ఇళ్లల్లోకి ప్రవేశిస్తోందని, రాక పోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతోందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వాసాల తిప్ప డ్రెయిన్‌లో పూడిక తొలగింపు



వాసాలతిప్ప డ్రెయిన్‌లో జేసీబీతో పూడిక తొలగింపు పనులు

సాక్షి స్పందన

అమలాపురం రూరల్: చిందాగరువు వద్ద మూసుకుపోయిన వాసాలతిప్ప డ్రెయిన్‌లోని పూడిక తొలగింపు పనులను ఎట్టకేలకు అధికారులు చేపట్టారు. ముందు జాగ్రత్త చర్యలు తీసుకోకుండా ఇసుక స్టాక్ యార్డు ఏర్పాటు చేసి ఇసుకను స్టోరేజ్ చేయడం వల్ల డ్రెయిన్ మూసుకుపోయిందని సాక్షిలో 22వ తేదీన వచ్చిన కథనంపై అధికారులు స్పందించారు. డ్రెయిన్‌లో మట్టి, పూడిక తొలగింపు పనులు ఆదివారం చేపట్టారు. స్టాక్ యార్డును బైపాస్ రోడ్డు వంతెన పక్కన ఉన్న స్థలంలోకి మార్పు చేశారు. పూర్తిస్థాయిలో పూడిక పనులు చేయాలని రైతులు కోరుతున్నారు.

కనువిందు హరివిల్లు



డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి కాంస్య విగ్రహం వెనుక ఆకాశంలో ఏర్పడిన హరివిల్లు

యానాం: సాధారణంగా వర్షం కురిసిన తర్వాత ఇంద్రధనుస్సు ఏర్పడి కనువిందు చేస్తాయి. చాలా సార్లు అవి మనకు స్పష్టంగా కనిపించవు. ప్రకృతిలో సూర్యకాంతి అనేక లక్షల నీటి బిందువులతో విక్షేపణం చెందడం వల్ల ఇంద్రధనుస్సు ఏర్పడుతుంది. ఆ విధంగా నీటి బిందువులపై పడిన కాంతి వక్రీభవనం చెందడం వల్ల ఇంద్రధనుస్సులు ఏర్పడుతుంటాయి. యానాంలో ఆదివారం తెల్లవారుజామున కురిసిన వర్షం అనంతరం సూర్యోదయం సమయంలో ఇంద్రధనుస్సు కనువిందు చేసింది. యానాం–ద్రాక్షారామ రహదారిలో ఉన్న దివంగత మహానేత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి నిలువెత్తు కాంస్య విగ్రహం వెనుక భాగంలో హరివిల్లు అందరినీ ఆకట్టుకుంది.

అమరవీరుల త్యాగాలు మరువలేం

నీలపల్లిలో స్మారక స్థూపం ఆవిష్కరణ



నీలపల్లిలో కమ్యూనిస్టుల స్మారక స్థూపాన్ని ఆవిష్కరిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

తాళ్లరేవు: సీపీఎం త్యాగాల పునాదులపై నిర్మితమైందని, అమరవీరుల త్యాగాలను మరువలేనిదని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం నీలపల్లి సిద్దార్థ నగర్‌లో నిర్మించిన తొలితరం కమ్యూనిస్టు నాయకుల స్మారక స్థూపాన్ని ఆయన ఆవిష్కరించారు. తొలుత పార్టీ జెండాను ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు ఆవిష్కరించారు. అనంతరం పార్టీ మండల కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు అధ్యక్షతన సభ నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు దువ్వా శేషుబాబ్జీ, పలివెల వీరబాబు, చెక్కా రమణి, కెఎస్ శ్రీనివాస్, డాక్టర్ చలం, విశ్వజన కళామండలి రాష్ట్ర అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలు, ఎండీయూడబ్ల్యూఏ అధ్యక్షుడు కన్నీడి వెంకటరమణ, నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

అమలాపురం రూరల్: దీపం బుడ్డి కారణంగా చీరకు నిప్పు అంటుకుని తీవ్ర గాయాలు పాలై కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి చెందింది. అమలాపురం మండలం కామనగరువు గ్రామ పరిధి కరక్కాయిపేటకు చెందిన భీమవరపు వెరమ్మ (74) ఈనెల 16వ తేదీ రాత్రి ఇంటి వద్ద కరెంటు పోవడంతో ఆమె దీపం బుడ్డి వెలిగించింది. ఆమె పెంపుడు కోళ్లకు మేత పెడుతున్న సమయంలో హఠాత్తుగా దీపం బుడ్డి మంట చీరకు అంటుకుంది. దాంతో ఆమె కాలు కాలిపోయింది. గాయాలపాలైన వెరమ్మను అమలాపురం ఏరియా ఆసుపత్రికి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై శేఖర్‌బాబు ఆదివారం తెలిపారు. మృతురాలు కుమారుడు సత్తిబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాలూకా ఎస్సై తెలిపారు.

ఉద్యానవనం.. నిర్వహణ అధ్వానం

సిమెంట్ బల్ల శిథిలం కావడంతో డ్రెయిన్‌లో పడ్డ బాలుడు



అమలాపురం ఉద్యానవనం (పార్కు)లో డ్రెయినేజీపై శిథిలమైన సిమెంట్ బల్ల

అమలాపురం టౌన్: మున్సిపాలిటీ ఆధీనంలోని చంద్రబాబు ఉద్యాన వనం (పార్కు) ఇటీవల శిథిలావస్థకు చేరుకుంది. దీంతో సందర్శకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వారి ఆందోళనకు తగినట్టుగానే సరదాగా పార్కునకు వచ్చిన ఓ పదేళ్ల బాలుడు ఆడుకుంటూ మూత లేని పార్కు డ్రెయిన్‌లో ఆదివారం ప్రమాదవశాత్తు పడ్డాడు. డ్రెయిన్‌లోని మురికి నీటిలో పడ్డ బాలుడు వెంటనే తేరుకుని ఏటువంటి గాయాలు లేకుండానే బయటపడ్డాడు. దీంతో సందర్శకులు ఊపిరి పీల్చుకున్నారు. డ్రెయిన్‌పై ఉన్న బల్ల శిథిలమై ప్రమాదకరంగా మారడంతోనే బాలుడు అందులో పడ్డాడని స్థానికులు అన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు పార్కు దుస్థితిపై స్పందించి చర్యలు చేపట్టాలని రోజూ ఆ పార్కుకు వచ్చే సందర్శకులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికే ఆ పార్కులో పిల్లలు ఆడుకునే పరికరాలు కొన్ని తప్పు పట్టు మరికొన్ని ధ్వంసమై అసౌకర్యంగా ఉన్నాయి. ఇటీవల ఓ బాలుడు ఆట పరికరాలతో ఆడుకుంటున్న సమయంలో తుప్పు పట్టిన రేకు వల్ల చేతికి గాయాలయ్యాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు పార్కు పురోభివృద్ధికి చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఘనంగా హనుమాన్ శోభాయాత్ర



ముమ్మిడివరంలో హనుమాన్ శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

ముమ్మిడివరం: స్థానిక పోలమ్మ చెరువు వద్ద గల అభయాంజనేయస్వామి శోభాయాత్ర ఆదివారం వైభవంగా నిర్వహించారు. హనుమాన్ జయంతి సందర్భంగా ఈనెల 22న నుంచి ప్రారంభమైన ఉత్సవాలు ఆంజనేయస్వామి శోభాయాత్రతో ముగిసాయి. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఆంజనేయస్వామిని ప్రతిష్ఠించి నగర వీధుల్లో తీన్మార్ డప్పుల వాయిద్యాలు, బుట్టబొమ్మలు, విచిత్ర వేశాధారణ నడుమ, బాణసంచా కాల్పులతో ఊరేగించారు. ఆలయ అర్చకులు సుదర్శనం శ్రీరామ చిరంజీవి ఆచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజల అనంతరం శోభాయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాడి నరసింహారావు, ములపర్తి బాలకృష్ణ, కట్టా సత్తిబాబు, కాజులూరు రామలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన

అమలాపురం రూరల్: భట్నవెల్లిలో మంచినీటి ట్యాంకు నిర్మాణానికి ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, ఆముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, సర్పంచ్ తిరుకోటి సుజాత, నాయకులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.85,642 విరాళం



దాత చంద్రశేఖర్ కుటుంబ సభ్యులకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న అర్చకులు

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి రాజమహేంద్రవరానికి చెందిన కురిసెట్టి చంద్రశేఖర్ గుప్తా–ప్రత్యూష దంపతులు రూ.50,409, సీతానగరం మండలం మునికూడలికి చెందిన గోలి లక్ష్మీఅక్షయ రూ.15,001, పేరూరుకు చెందిన ఉపాధ్యాయుల భానుప్రియ రూ.10,116, విజయవాడకి చెందిన గొనుగుంట పృథ్వీరాజ్ జ్యోతిర్మయి రూ.10,116 విరాళం అందజేశారు. ఈ సొమ్మును దాతలు ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయకరావుకు అందజేశారు. దాతలను వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

క్యాన్సర్ బాధితుడికి ఆర్థిక సాయం



రావులపాలెంలో క్యాన్సర్ బాధితుడి భార్యకు చెక్కు అందజేస్తున్న సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న బాధితుడి వైద్య ఖర్చుల నిమిత్తం స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ ఆర్థిక సాయం అందించి తన ఔదార్యాన్ని చాటుకుంది. అంబాజీపేట మండలం చిరతపూడి గ్రామానికి చెందిన పితాని రమేష్‌కి నోటిలో కణితి ఏర్పడి క్యాన్సర్‌గా మారింది. దానికి ఆపరేషన్ చేసి కణితి తొలగించి క్యాన్సర్‌కి కీమో రేడియేషన్ ట్రీట్మెంట్ చేస్తున్నారు. వైద్యానికి చాలా ఖర్చు అవుతుండటంతో కూలి పని చేసుకుని కుటుంబాన్ని పోషించుకునే ఆ క్యాన్సర్ బాధితుడికి తగిన ఆర్థికస్తోమత లేక రావులపాలెం కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థను ఆశ్రయించారు. అతడి కుటుంబ ఆర్థిక పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని ఆర్థిక సాయం చేయడానికి సేవా సంస్థ వారు ముందుకు వచ్చారు. ఆ మేరకు ఆదివారం సాయంత్రం సేవా సంస్థ సభ్యులు క్యాన్సర్ బాధితుడు రమేష్ భార్య చంద్రకళకు రూ.11,500 చెక్కు రూపంలో అందజేశారు. ఆమె సేవా సంస్థ సభ్యులకు కృతజ్ఞతలు తెలియచేశారు.

సీహెచ్‌సీలో ఐసోలేషన్ వార్డు ఏర్పాటు

పి.గన్నవరం: ఇటీవల మళ్లీ కోవిడ్ కేసులు వెలుగు చూస్తున్న నేపథ్యంలో జిల్లా అధికారుల ఆదేశాలతో పి.గన్నవరం సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఐదు బెడ్లతో ఐసోలేషన్ వార్డు ఏర్పాటు చేసినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ యు.రాఘవేంద్రరావు తెలిపారు. ముందు జాగ్రత్త చర్యగా నియోజకవర్గ స్థాయిలో ఇక్కడ వార్డు ఏర్పాటు చేసినట్టు ఆయన వివరించారు. నియోజకవర్గంలో ఎక్కడా కోవిడ్ కేసులు లేవన్నారు. కోవిడ్ పట్ల ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఎవరికైనా కోవిడ్ లక్షణాలు కనబడితే వెంటనే ప్రభుత్వ వైద్యులను సంప్రదించాలని ఆయన సూచించారు.

గురువును ఆశ్రయించినవాడే నిజమైన భక్తుడు



విశేష పూజలు నిర్వహిస్తున్న ప్రభూజీ సుందర శ్రీనివాస్‌దాస్

అయినవిల్లి: పరంపర ఆచార్యుడిని గురువుగా స్వీకరించినవాడే నిజమైన భక్తుడని, పరంపర నుంచి వచ్చిన గురువును ఆశ్రయించిన భక్తుడు సాధన ద్వారా భగవంతుడి నిజమైన రూపం దర్శనమిస్తుందని నల్లచెరువు అంతర్జాతీయ మందిర్ నిర్వాహకుడు ప్రభూజీ సుందర శ్రీనివాసదాస్ అన్నారు. ఆదివారం ప్రభూజీ సుందర శ్రీనివాస్‌దాస్ స్వామికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ స్వామికి విశేష పూజలు చేశారు. హరినామ సంకీర్తనలు, తులసి పూజ, పంచామృతాభిషేకం నిర్వహించారు. శ్రీమద్భాగవత ప్రవచనం నిర్వహించారు. మందిరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అనంతరం భక్తులకు మహాప్రసాద వితరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు ఈ పూజల్లో పాల్గొని స్వామిని కీర్తించారు. స్వామివారి ప్రసాదం స్వీకరించారు.